మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మండల ప్రత్యేక అధికారి హరికిషన్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి హరికిషన్

పెద్దశంకరంపేట, జూలై27 ప్రభాతవార్త:
గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించి పారిశుద్ధ్య సమస్యలు రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి హరికిషన్ అధికారులకు సూచించారు. శనివారం పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ సమావేశంలో గ్రామ పంచాయితీలో జరుగుతున్న పనులను పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై మురికి నీరు ప్రవహించకుండా చూసుకోవాలని, గుంతల్లో నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని, ఎప్పటికప్పుడు దోమల మందులు పిచికారీ చేయాలన్నారు. పరసిరాల పరిశుభ్రత ఆరోగ్య నియమాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. తడి పొడి చెత్తను వేరు వేరుగా డంపుయార్డుకు తరలించాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రేసీబాయి, మండల నోడల్ అధికారి వెంకటేశం, పంచాయితీ కార్యదర్శి వెంకట రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బస్టాండ్‌ను సందర్శించిన ఈడి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడి

హుస్నాబాద్ రూరల్ జూలై27,ప్రభాతవార్త
హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆర్టీసి ఈడి వినోద్‌కుమార్ శనివారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా బస్‌స్టాండ్‌లోని ప్రయాణికులను ఆర్టీసీ సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుస్నాబాద్ బస్టాండ్‌ను మోడ్రన్ బస్టాంగ్‌గా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు ఎక్కడి వరకు వచ్చయని డిపో మేనేజరు వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌ను ఆదునీకరించేందుకు పాటించాలని సూచనలు చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మేనేజరుకు వివరించారు. బస్టాండ్‌ను సందర్శించిన వారిలో కరీంనగర్ ఈఈ పోచయ్యలింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొల్చారంలో దుర్గమ్మ, పోచమ్మలకు బోనాలు

కొల్చారం, జూలై27 ప్రభాతవార్త:
ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడు కూడా మండల కేంద్ర కేంద్రమైన కొల్చారం గ్రామంలోని దురమ్మ, పోచమ్మలకు ఆలయాల్లో అంగరంగ వైభవంగా బోనాలను నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామస్థులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) ఉదయం గ్రామంలోని పురవీధులు గుండా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి దుర్గమ్మ, పోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

-ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలి
-పాఠశాలల్లో ఉన్న సమస్యలన్నీ తొలగిస్తాం
-ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించిన జిల్లా కలెక్టర్
-మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

వెల్దుర్తి, జూలై27 ప్రభాతవార్త:
ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం మాసాయిపేట మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, పశు వైద్యశాలలను తనిఖీ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలోని ధరణి పెండింగ్ ఫైల్‌లను, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో భోజన ఏర్పాట్లను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా మారి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. విద్యార్థులను గణితంలో వివిధ ప్రశ్నలు అడుతూతూ సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఉన్నారని, చాలా బాగా చదువుతున్నారని, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. మండల కేంద్రంలోని వాడలన్నీ తిరుగుతూ జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులను పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాటాడ్లడుతూ మాసాయిపేట మండలంలో ధరణిలో పెండింగ్ సమస్యలను పూర్తి చేయాలన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రజావాణిలో దరఖాస్తున్న చేసుకున్న వారికి, వారి సమస్యలపై లిఖిత పూర్వక సమాధానాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పౌష్టికాహారమైన భోజనం అందించాలని, అంగన్వాడీలో ఉన్న వంట గదిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత కలిగిన విద్య, భోజనంతో పాటు అర్హత కలిగిన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, ఉత్తమమైన బోధన ఈ పాఠశాల్లో జరుగుతుందని విద్యార్థులను అభినందించారు. తానే స్వయంగా విద్యార్థులుకు గణితం పాఠాలు బోధిస్తూ గణితంలో ఉన్న మెలకువలను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరిస్తానని తెలియజేశారు. గ్రామంలో ఉన్న వాడలన్నీ పరిశీలిస్తూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిలవ ఉండకుండా చూడాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పశు వైద్యశాలలో సిబ్బంది సమయ పాలన పాటించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యకమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## నర్సాపూర్‌లో కుక్కల బెడద నివారణకు చర్యలు

-వారంలో రెండు రోజులు సంత నిర్వహణ
-రెడీమేడ్ మరుగుదొడ్ల ఏర్పాటుకు కృషి
-నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
-మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్



నర్సాపూర్‌మున్సిఫల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిఫల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్,వైస్ చైర్మన్ ,కౌన్సిలర్‌లు తదితరులు

నర్సాపూర్, జూలై 27. ప్రభాతవార్త :
నర్సాపూర్ పట్టణంలో కుక్కల బెడద అధిమవుతన్న తరుణంలో కుక్కల బెడద నివారణ కోసం చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం నర్సాపూర్‌మున్సిఫల్ కార్యాలయంలో మున్సిఫల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతితిగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు. కాగా ఈసమావేశంలో 3 వ వార్డు కౌన్సిలర్ ఇస్రత్ సిద్దిఖ మాట్లాడుతూనర్సాపూర్ పట్టణంలో కుక్కల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందుల పడుతున్నారని తెలిపారు. ఈ కుక్కలతో పలువురికి ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయని అన్నారు. ఈ మేరకు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మరో కౌన్సిలర్ సరితా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ కుక్కలతో పాటు కోతుల బెడద కూడ తీవ్రంగా ఉందని వెంటనే నివారణ చర్యల చేపట్టాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూకుక్కల ,కోతుల బెడద నివారణకు నర్సాపూర్ రాయరావుచెరువు సమీపంలోగల స్థలంలోకుక్కలకు షెడ్డును ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కుక్కల, కోతుల బెడద నివారణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోవాలోఅని జిల్లా కలెక్టర్ కు ఒక నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా నర్సాపూర్ పట్టణంలో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారం రోజుల్లో సంతను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రోజున గాంధీ విగ్రహం నుండి పోస్లాఫీస్ వరకు సంతను నిర్వహిస్తామని అలాగే శుక్రవారం రోజున గాంధీ విగ్రహం నుండి ఇండియా బ్యాంక్ వరకు సంతను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నర్సాపూర్ పట్టణంలో రెండు రోజులు సంత నిర్వహించాలని కౌన్సిల్ ఆమోదంతో తీర్మానించామని తెలిపారు. అదేవిదంగా పట్టణంలోని బస్టాండ్ వద్ద, కోమటి కుంట వద్ద నిర్మించిన మరుగుదొడ్లు చాల కాలంగా నిరుపయోగంగా ఉన్నందున ఈ మరుగుదొడ్లను త్వరలోనేవినియోగం లోకి తీసుకువస్తామని అన్నారు. అదేవిదంగా నర్సాపూర్ పట్టణంలోని ధర్మశాల వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద పోస్టఫీస్ వద్ద ఈ మూడు ప్రాంతాల్లో రెడిమెడ్ గా మూత్రశాలలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే నర్సాపూర్ పట్టణంలో ఆది, సోమవారాల్లో జరిగే బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తో పాటు మున్సిఫల్ వైస్ చైర్మన్ నహియొద్దీన్, మున్సిఫల్ కమీషనర్ జైత్‌రాంనాయక్, విధ్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్, కౌన్సిలర్‌లు సంగసాని సురేశ్, పంబళ్ళ రాంచందర్, పంబళ్ళ లలిత బిక్షపతి, ఇస్రత్ సిద్దిఖ, సరిత ఆంజనేయులు గౌడ్, సునీత బాల్‌రెడ్డి, లక్ష్మినాగేశ్, మున్సిఫల్ మేనేజర్ మదుసూధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని 'ఖేడ్' ఆర్టీసి బస్సులు

-ప్రమాదం అని తెలిసినా ప్రైవేటులో ప్రయాణం
-పద్ధతిగా నడపాలని ప్రయాణీకుల వినతి

**మనూర్, జులై 27, ప్రభాతవార్త:** ప్రయివేటులో ప్రయాణించొద్దు ఆర్టీసిలోనే ప్రయాణించాలని పదే పదే చెప్పే ఆర్టీసి అధికారులు తమ డిపో బస్సులు సమయ పాటించే విధంగా నడపడంలో నారాయఖేడ్ ఆర్టీసి డిపో పూర్తిగా విఫలమవుతోందని ప్రయాణీకులు మండిపడుతున్నారు. నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ పట్టణానికి, కర్ణాటకలోని బీదర్ పట్టణానికి వెళ్లాలంటే నారాయణఖేడ్ డిపో బస్సులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాలకు నారాయఖేడ్ డిపో బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణీకులకు నారాయణఖేడ్ ఆర్టీసి డిపోపై నమ్మకం సన్నగిల్లుతోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అనునిత్యం నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ వైపు జహీరాబాద్ నుంచి నారాయణఖేడ్ ప్రాంతానికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు వస్తూ పోవాల్సి ఉంటుంది. ఆర్టీసికి హైద్రాబాద్ రూట్ తరువాత జహీరాబాద్ ప్రాంతానికి నడిచే బస్సులు ఆదాయం అధికంగా సమకూరుస్తున్నాయని ఆర్టీసి రికార్డులు దృవీకరిస్తున్నా ఈ రూట్లో బస్సులను సమయానికి నడిచేలా చూడకపోవడం విడ్డూరంగా ప్రయాణీకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ డిపోకు చెందిన బస్సులు రాయిపల్లి మీదుగా నిజామాబాద్‌కు నడిచే బస్సులు క్రమం తప్పకుండా సమయానికి వస్తూంటాయని, ఆలస్యమైతే 2 నుంచి 4 నిమిషాలే అవుతాయని ప్రయాణీకులు గుర్తు చేసుకుంటున్నారు. జహీరాబాద్ డిపోను ఆదర్శంగా తీసుకుని నారాయణఖేడ్ డిపో బస్సులను సైతం సమయ సారణి పాటించేలా చూడాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు. జహీరాబాద్ డిపో బస్సులను నారాయణఖేడ్ పట్టణం వరకు నడపాలని ప్రయాణీకులు సూచిస్తున్నారు. గతంలో నారాయణఖేడ్ డిపో నుంచి జహీరాబాద్‌కు రాత్రి 8,30 గంటలకు నైట్ హాల్ట్ బస్సు నడిచేదని, నైట్ హాల్ట్ బస్సును రద్దు చేయడంతో ప్రయాణీకులు పాట్లు పడక తప్పడం లేదని తెలుస్తోంది. సమయ సారణి పాటించకపోవడంతో ప్రయాణీకులు ప్రమాదం అని తెలిసినా ప్రయివేటు వాహనాల్లో ప్రయాణించాల్సి దుస్థితి దాపురించిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇప్పటికైన నారాయణఖేడ్ డిపో అధికారులు తమ డిపో నుంచి బస్సులు సమయానికి నడిచేలా చర్యలు తీసుకోవాలని, జహీరాబాద్ డిపో బస్సులు నారాయణఖేడ్‌కు నడిపేలా చూడాలని ప్రయాణీకులు వినతి చేస్తున్నారు.

## రెవిన్యూ కార్యాలయం ముందు మహిళ ఆత్మహత్యాయత్నం

-భూమి రిజిస్ట్రేషన్ ఆపాలంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న మహిళ



భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న ధర్జీ లక్ష్మీ

**చౌటకూరు, జులై 27, ప్రభాతవార్త:** తమకు చెందిన భూమిని తమ అత్తామామలు అమ్ముకుంటున్నారని, సదరు భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ ఓ మహిళ రెవిన్యూ కార్యాలయం ముందుఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిని సంఘటన శనివారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన చౌటకూరులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు... మండలంలోని సరాప్‌పల్లి గ్రామానికి చెందిన ధర్జీ లక్ష్మీకి గ్రామంలోని సర్వే నంబర్ 354/1/2లో 8 భూమిని తనకు తెలియకుండా తమ అత్తామామలు తమ వారసత్వ భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ కార్యాలయం ముందు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. తమ అత్తామామలకు ఇద్దరు కుమారులు ఉండే వారిని, ఇద్దరు కానరాని లోకాలకు చేరిపోవడంతో సదరు భూమి అత్తామామల పేరుపై ఉందని, సదరు భూమివారి పేరుపై ఉంటే తమకెలాంటి ఇబ్బంది లేదని, కాని భూమిని అమ్మడానికి వీలులేదని బాధితురాలు ధర్జీ లక్ష్మీ పేర్కొన్నారు. బాధితురాలు రెవిన్యూ కార్యాలయం ముందు ఆత్మహత్యా యత్నంకు పాల్పడినట్లు తెలుసుకున్న పుల్కల్ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి సదరు భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ తహసీల్దార్‌ను కోరారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు ముమ్మరం

-మున్సిపల్ కమీషనర్ దేవేందర్



వార్డు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ దేవేందర్

రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 27, ప్రభాతవార్త :
వర్షాకాలం ప్రభావంతో ప్రజలకు సీజనల్ వ్యాదులు ప్రబలకుండా మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో చర్యలు ముమ్మరం చేయాలని రామాయంపేట మున్సిపల్ కమీషనర్ ఎం. దేవేందర్ వార్డు అధికారులను ఆదేశించారు. శనివారం నాడు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో 12 వార్డులకు సంబంధించి ఆయా వార్డు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రభావంతో పట్టణంలోని ప్రజలు రోగాల బారిన పడకుండా ప్రతి వార్డులో ఉదయం పూట ప్రజలతో మమేకమై త్రాగునీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో వార్డు అధికారులు విధిగా పర్యటించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతే కాకుండా ప్రతి శుక్రవారం రోజు మున్సిపల్ అధికారులతో ఫ్రైడే...డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, సానిటేషన్ సిబ్బందిని భాగస్వామ్యం చేస్తూ ప్రతి వార్డులో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో కూడా ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, 12 వార్డుల వార్డు అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, మన్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

-జెడ్పీ సీఈవో ఎల్లయ్య



ప్రజా పాలన కేంద్రంలో తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో ఎల్లయ్య

పెద్దశంకరంపేట, జూలై27 ప్రభాతవార్త:
ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాలలో ఏర్పాటైన ప్రజా పాలన కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను, రికార్డులను పరిశీలించిన అనంతరం పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వర్షాకాలం వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టి మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో రంగాచార్యులు, ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, సూపరింటిండెంట్ షకీల్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకురాలు



ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మంజూల రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, జూలై27, ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకురాలు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజూలరెడ్డి శనివారం రోజున రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమక్షంలో రాష్ట్ర సచివాలంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందిచి శాలువాతో సత్కరించారు.

## నూతన చట్టాల పైన ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్‌జడ్జి న్యాయమూర్తి అనిత




నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి అనిత తదితరులు

నర్సాపూర్ జూలై 27. ప్రభాతవార్త :
ప్రతి ఒక్కరికి నూతన చట్టాల పైన అవగాహన కల్గి ఉండాలని జూనియర్ సివిల్‌జడ్జి, మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ నర్సాపూర్ న్యాయమూర్తి కె.అనిత అన్నారు. శనివారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ అధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ సివిల్‌జడ్జి న్యాయమూర్తి కె.అనిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు స్థిరాస్తులను కొనుగోలు చేసనప్పుడు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. తెల్ల కాగితాల పైన బాండ్ పేపర్ల పైన విక్రయాలు చెల్లవని తెలిపారు. ఈమేరకు గ్రామాల ప్రజలు ఇటీవల స్థిరాస్తులనుబాండ్ పేపర్లపై నోటరీలపై విక్రయాలు జరుపుతున్నారని అన్నారు. తద్వార చట్ట పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఇరు వర్గాల మధ్య రాసుకున్న తెల్లపేపర్లు, బాండ్ లు చట్ట బద్ధత లేక ఇబ్బందులు పడుతారని అన్నారు. కాగా టీవల పార్లమెంట్ ద్వార భారత రాజ్యాంగ బద్దంగా నూతన చట్టాలు రూపొందించబడి అమలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరు నూతన చట్టాల పైన అవగాహన కల్గిఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టబద్దంగా అర్హులైన వ్యక్తులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవ్యక్తులకు చట్ట పరమైన సమస్యలు తలెత్తినప్పుడు మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వార ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయాన్ని అందించబడుతుందని తెలిపారు. అనంతరం మండల్ లీగల్ సర్వీస్ ద్వార పిఎల్‌సి కేసులను పరిష్కరించడం జరిగింది. ఈకార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, న్యాయవాది ఆనంద్ కుమార్, కోర్టు సూపరిండెంట్ పద్మావతి, వివిద గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ములుగు, జులై 24 ప్రభాతవార్త :** అతివేగం, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ములుగు మండలం కొత్తూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన బుల్లి సాయికుమార్(22) తన స్నేహితుడు తీగుళ్ల శివకుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్ళారు. ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా అజాగ్రత్తగా నడిపించడంతో రాత్రి 12 గంటల సమయంలో కొత్తూరు గ్రామ సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలకు గురైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

# హైదరాబాద్‌లో నోరో వైరస్

**-ప్రజలను అప్రమత్తం చేసిన జిహెచ్ఎంసి**
**-అన్నిరకాల చర్యలు తీసుకోవాలని నగరవాసులకు సూచన**




**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:**
కరోనా వైరస్ పంజా నుంచి ఇంకా పూర్తిగా కోలుకోనేలేదు అప్పుడే మరోవైరస్ కలకలం రేపుతుంది. అత్యంత వేగంగా వ్యాపించే నోరో వైరస్ హైదరాబాద్‌లో నూ విస్తరిస్తుంది. ఈనేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈనోరో వైరస్ విషయంలో ప్రజలను అప్రమత్తం చేసింది. నోరో వైరస్ వ్యాధితో జాగ్రత్తగా ఉండాలంటూ శనివారం ఎక్స్(ట్విటర్)వేదికగా పలు సూచలను చేసింది. కలుషిత నీరు, ఆహారం కారణంగా ఈవ్యాధి చెందుతుందని పేర్కొంది. చలిజ్వరం, వాంతులు, వీరేచనాలు, నీరసం, కడుపునొప్పి , డీహైడ్రేషన్ లక్షణాలు ఉంటాయని తెలిపింది. చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని ,కాచిచల్లార్చి వడపోసిన నీటిని తాగాలని పేర్కొంది. ఇంటిని , పరిసర ప్రాంతాలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసుకోవాలని సూచించింది. కాగా ప్రస్తుతం ఈనోరొ వైరస్ కేసులు హైదరాబాద్‌లోని యాకత్‌పురా, మలక్‌పేట్, డబీర్‌పురా, పురానా హవేలీ, మెఘల్‌పురాతోపాటు పలు ప్రాంతాల్లో నమోదువుతన్నాయి. ఈవైరస్‌బారిన పడినవారు ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు.

## బ్రాహ్మణులు సమాజానికి జ్ఞానసంపద ఇచ్చారు : మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కరరావు



**చిక్కడపల్లి, జూలై 27 ప్రభాతవార్త:** బ్రాహ్మణులు సమాజానికి జ్ఞాపసంపద ఇచ్చారని, కానీ నేడు వారి పరిస్థితి కొందరి వల్ల వివక్షతకు గురి అవుతున్నారని సమైక్యరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కరరావు అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో మోహన్‌ట్రస్ట్ అధినేత పిఎంకె.గాంధీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర-తెలంగాణ అపూర్వ కళా ప్రదర్శనం పేరుతో 'తెలుగు కళా మాలిక' పేరుతో భిన్న కళాప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను మాజీ సిఎం నాదేండ్ల భాస్కరరావు సత్కరించి అభినందించారు. ఎంఎన్.రాయ్ వంటి మహనీ యులు దేశ కీర్తి పెంచారన్నారు. చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అధ్యక్షత వహించా రు. ఈ సందర్భంగా సేవా ధార్మిక శిఖర పురస్కారాన్ని కేతరాజు పూర్ణిమా కావమేశ్వరరావు(అమెరికా), ధార్మికవేత్త మలమంచి మోహన్‌జోషి, ఆత్మీయ పురస్కారాలను డాక్టర్ జివిఆర్.ఫణీంద్రకుమార్‌తో పాటు పలువురిని సత్కరించారు. గౌరవ అతిథిగా మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, కవి, రచయిత,పూర్వ మైన్స్ డైరెక్టర్ డాక్టర్ వీడి.రాజగోపాల్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా బియ్యం సంస్థ అధ్యక్షుడు గాంధీ నిర్వహణలో అందించారు. పేదలకు బియ్యం పంపిణీ, వ్యక్తిత్వ వికాసం కోసం తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు.



# నేడు లాల్‌దర్వాజ బోనాలు

**-అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**-రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్న డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,**
**అమ్మవారిని దర్శించుకోనున్న మంత్రులు,**
**-2500 మంది పోలీసులతో గట్టి బందోబస్తు**



**చాంద్రాయణగుట్ట, జూలై 27 ప్రభాతవార్త,**
ఆషాడమాసం చివరి ఆదివారం లాల్‌దర్వాజ బోనాలకు పాతబస్తీ సర్వం సిద్ధం అయింది. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం పాతబస్తీలో జరిగే లాల్‌దర్వాజ బోనాలకు అన్ని శాఖల అధికారులు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు బోనాల సమర్పణ, దర్శనం కార్యక్రమం ప్రారంభమవుతుంది. బోనాలను వైభవంగా నిర్వహించేందుకు శనివారం నుంచే ఆర్అండ్‌బీ, జిహెచ్ఎంసి, పోలీసు సిబ్బంది భక్తులకు అమ్మవారి ఆలయాల వద్ద క్యూలైన్‌లు, బందోబస్తు, కావాల్సిన ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తుతో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేయించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4 గంటలకు బలిహరణ, అనంతరం మాజీ మంత్రి తూళ్ళ దేవేందర్ గౌడ్ కుటుంబసభ్యులచే దేవి మహాభిషేకం, ప్రత్యేక పూజలు అమ్మవారికి తొలిబోనం సమర్పించిన అనంతరం భక్తులచే బోనాల సమర్పణ ప్రారంభమవుతుంది. రాత్రి 8 గంటలకు శాంతి కళ్యాణం చేయనున్నారు. పాతబస్తీలోని లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి అమ్మవారు, మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయం, ఉప్పుగూడ మహంకాళి, సుల్తాన్‌షాహి జగదాంబ, శీతల్‌మాతా ఆలయం, గౌలిపురా కోట మైసమ్మ, మాతేశ్వరీ భారతమాత ఆలయం, నల్ల పోచమ్మ, హరిబౌలి బంగారు మైసమ్మ, అక్కన్నమాదన్న, బేలా ఆలయాలను ఇప్పటికే ఆలయ కమిటీ ప్రతినిధులు రంగురంగుల పూలు, విద్యుత్‌ద్దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు ప్రభుత్వం తరపున అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మేయర్ విజయలక్ష్మి పలువురు అధికార, అనధికార ప్రముఖులు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. బోనాల పండుగ, ఊరేగింపు సమయంలో ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ తెలిపింది. ఎక్కడైన అసౌకర్యాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

### 2500 మందితో గట్టి పోలీస్ బందోబస్తు.....

లాల్‌దర్వాజ బోనాల సందర్భంగా 2500 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తును నిర్వహిస్తున్నారు. పాతబస్తీలోని ఫలక్‌నుమా, ఛత్రినాక, చార్మినార్, మీర్‌చౌక్ పోలీస్టేషన్‌ల పరిధిలో ఈ నెల 28, 28 తేదిల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సిపి విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం బోనాల పండుగ, సోమవారం ఘటాల ఊరేగింపు, హరిబౌలి అక్కన్నమాదన్న దేవాలయం నుండి నయాపూల్ వరకు ఏనుగు అంబారీపై ఘటం ఊరేగింపు సందర్భంగా లాల్‌దర్వాజ నుండి నయాపూల్ వరకు రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు అదనపు సిపి వెల్లడించారు. కాగా లాల్ దర్వాజ దేవాలయం, ఎంజీబిఎస్. జేబిఎస్ వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 9959226154, 9959226160 నంబర్లకు సంప్రదించవచ్చని వెల్లడించారు.

## బోనాల పండగకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం**

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:**
నగరంలోని పలుప్రాంతాల్లో ఆదివారం జరిగే బోనాల ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులు ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ జోనల్,డిప్యూటీ కమిషనర్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ..నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న బోనాలు ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో గ్రేటర్‌లో కూడా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా త్రాగు నీరు, పాట్‌హోల్స్, పారిశుద్ధ్యం, అవసరమైన టాయిలెట్స్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ,స్ట్రీట్‌వెండర్లు వ్యర్థాలను బయట వేయకుండా చెత్తకుండీలల్లో వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా గుడిచుట్టూ ప్రాంతంలో పిరిశుభ్రంగా ఉండేవిధంగా ఎప్పటికప్పుడు చెత్తను తీసేవిధంగా శానిటేషన్ కార్మికులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిళ్లవారీగా పంపించాలని కోరినప్పటికీ సరిగా పంపించడం లేదని, కమ్యూనిటీ హాళ్లలో కావాల్సిన మరమ్మత్తులు, ఎవరి ఆధీనంలో ఉంది అన్న వివరాలను కూడా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## నగరంలోని పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, జూలై 27 ప్రభాతవార్త**
హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా చేసే మంజీరా ఫేస్-1 పైపులైన్‌కు పటాన్‌చెరువులోని వాల్యూ జోన్ వద్ద జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు ఈనెల 30వ తేది మంగళవారం ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు 31వ తేది బుధవారం ఉదయం 6గంటల వరకు జరుగుతాయని, ఈ నేపథ్యంలో 24గంటల పాటు పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి అధికారులు ప్రకటించారు. పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో పూర్తి అంతరాయం, మరికొన్ని ప్రాంతాలలో లో ప్రెజర్‌తో నీటి సరఫరా ఉంటుందన్నారు. ఓ అండ్ ఎం -8 బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పటాన్‌చెరువు ఇండస్ట్రియల్ ఏరియా ఓ అండ్ ఎం 15 పటాన్ చెరువు, ఆర్‌సి పురం, అశోక్‌నగర్ జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్‌పేట, డోయెన్స్ కాలనీ, ఎస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్‌లలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

## గురువులే సమాజానికి మార్గదర్శకులు : సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ



సంగీతకళా బిరుదాంకితులైన గురువులతో దైవజ్ఞశర్మ, శ్రీనివాష, సంధ్య తదితర అతిథులు

**నాంపల్లి, జులై 27 ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతిలో గురువులకు పెద్దపీట వేయడం జరిగిందని, తల్లిదండ్రుల తర్వాతి స్థానమైన వారు తమ శిష్యులతోపాటు యావత్ సమాజానికి మార్గదర్శకులు, అభ్యున్నతికి సోపానాలని ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞుడు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. గురువులేనిదే అభ్యున్నతి, అభివృద్ధి లేదని స్పష్టం చేస్తూ అలాంటి గురువులను ఎల్లవేళలా గౌరవిస్తూ పూజించి ఆశీస్సులు పొందాలని ప్రతీఒక్కరికీ సూచించారు. స్వరభారతి ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో శనివారం గురుపూజోత్సవం కన్నులపండువగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గాడేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ గౌరవ అతిథులు సంస్థ డైరెక్టర్ జి.సంధ్య, ప్రసన్న, దివ్య, మౌనిక, శ్రీనివాస్, ప్రతాప్, బాలు, శ్రీకాంత్ తదితరులతో కలిసి సంగీత గురువులు గీతసూర్ దత్త; బి.వి.రమణమూర్తి, బి.జనార్ధన్; వీరభద్ర; కేశవ్‌దాస్; పద్మావతిలకు గురుపూజ కావించి సంగీత కళాభారతి బిరుదుతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వరభారతి ఫౌండేషన్ ఆన్‌లైన్ మ్యూజికల్ కోర్సు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ గురుపూజోత్సవంలో 150మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించి ఆకట్టుకున్నాయి.

# ఫోను చోరీ.. ఖాతా ఖాళీ..!

**హైదరాబాద్, జూలై 27 ప్రభాతవార్త**
నగరానికి చెందిన సెల్‌ఫోన్ చోరుల నానాటికీ తెలివి మీరుతున్నారు. ఇదివరకు తస్కరించిన స్మార్ట్ ఫోన్లను మారు వ్యాపారులకు ఎంతోకొంతకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఇప్పుడు తస్కరించిన ఫోన్ సహాయంతో సంబంధిత యజమానికి చెందన బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తున్నారు. ఈ యజమానుల అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యమే వీరికి కలిసివస్తోందని సైబర్ క్రైమ్‌క పోలీసులు చెప్తున్నారు. ఇటీవల కాలంలో పలు ఉదంతాలు వెలుగులోకి రాగా, బయటకు రానివి అనేకం ఉంటాయని పేర్కొంటున్నారు. తస్కరించిన ఫోన్ ద్వారా ఎక్కువ లాభం పొందడం, పోలీసులకు చిక్కకుండా ఉండటమే దొంగల ప్రధాన ఉద్ధ్యేశం. ఈ చోరులు తస్కరించిన ఫోన్లను నగరంలోని వివిధ మార్కెట్‌లలో ఉన్న సెకండ్ హ్యాండ్ వ్యాపారులకు విక్రయించేవారు. సదరు స్మార్ట్ ఫోన్ ఎంత కొత్తది అయినా దాని అసలు ధరలో గరిష్టంగా 25 నుంచి 30శాతం మాత్రమే వ్యాపారులు చెల్లిస్తారు. మరోపక్క ఇటీవల కాలంలో నగరంలో జరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ టీమ్స్‌తో పాటు స్థానిక పోలీసులు అనేక మంది దొంగలు, వ్యాపారులను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తస్కరించిన ఫోన్‌ను విక్రయించకుండా ధ్వసం చేస్తున్నారు.

సాధారణంగా స్మార్ట్ ఫోన్లను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌లతోపాటు పిన్ వినియోగించి లాక్, అన్‌లాక్ చేసుకోవచ్చు. అయితే ప్రతి ఫోన్‌కు ఓ లాక్ పిన్ ఉండటం సాధారణం. స్మార్ట్ ఫోన్‌ను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌ల్లో అన్‌లాక్ చేయడంలో ఇబ్బందులు వచ్చినా, అన్‌లాక్ కోసం నిర్ణీత దఫాల కంటే ఎక్కువ సారున్ల ఈ మూడు ఆప్షన్స్‌ను తప్పుగా వినియోగించినా అప్పుడు పిన్ ఎంటర్ చేసి లన్‌లాక్ చేస్తుంటారు. అత్యధికులు ఇప్పటికీ 0000, 1234, 1111,9999 వంటి రొటీన్ సంఖ్యలనే పిన్ నెంబర్లుగా పెట్టుకుంటున్నారు. ఓ ఫోన్ చోరీ చేసిన తరువాత దొంగలు ఈ పిన్స్‌తో అన్‌లాక్‌కు ప్రయత్నిస్తున్నారు. అన్‌లాక్ పఫలీకృతమైతే బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయడంపై దొంగలు దృష్టి పెడుతున్నారు.

నగదు అవసరమౌనవాళ్లు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు డ్రా చేసుకోవడానికి గతంలో నేరుగా బ్యాంకుకు వెళ్ళేవారు. అపై ఏటీఎం మిషన్లు, నెట్ బ్యాంకింగ్స్ వచ్చాయి. అయితే ఇప్పుడు యూపీఐ యాప్స్ వినియోగంలోకి వచ్చాయి. కోవిడ్ పిరియడ్ తర్వాత దాదాపు ప్రతి ఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లోనూ యూపీఐ యాప్స్ ఉంటున్నాయి. అయితే ఫోన్ అన్‌లాక్ చేయడానికి వాడిని పిన్స్‌ను వినియోగించి దొంగలు యూపిఐ యాప్స్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా యాప్ ఓపెన్ కాకపోతే, దానిని అన్ ఇన్‌స్టాల్ చేసి, మళ్ళీ ఇన్‌స్టాల్ చేసి యాక్టివేటన చేస్తున్నారు. ఈ యాక్టివేషన్ కోసం బ్యాంకు ఖాతాతో లింకై ఉన్న సెల్‌ఫోన్ నెంబర్ తమ దగ్గర ఉండటం ఈ దొంగలకు కలిసి వస్తోంది. ఇలా యూపీఐ యాప్‌లు, ఒక్కోసారి నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫోన్ యజమానికి సంబంధించిన బ్యాంకు ఖాతాను చోరులు ఖాళీ చేసేస్తున్నారు. ఫోన్ వినియోగదారుడు మేల్కొని అవసరమైన చర్యలు తీసుకునే లోపే తీవ్ర నష్టం జరిగిపోతోంది.

### ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

- ఫోన్ పోగొట్టుకున్నా, తస్కరణకు గురైనా వెంటనే అప్రమత్తమై సిమ్ కార్డుతో పాటు బ్యాంకు ఖాతాను కూడా బ్లాక్, ఫ్రీజ్ చేయించాలి.
- కేవలం సిమ్‌కార్డును బ్లాక్ చేయించి ఊరుకుంటే ఫలితంలేదు. చోరుల వైఫై ద్వారా ఫోన్‌లో ఉన్న యూపీఐ యాప్స్ వాడి నగదు స్వాహా చేసే అవకాశం ఉంది.
- రొటీన్ అంకెలను పిన్ నెంబర్లుగా పెట్టుకోకూడదు. ఫోన్, యూపీఐ యాప్స్‌ను అన్‌లాక్ చేయడానికి ఒకే పిన్ వినియోగించకూడదు.
- కొన్నిసార్లు స్క్రీన్ గార్డులు అధ్యయనం చేయడం ద్వారా ప్యాట్రన్స్, పిన్ నెంబర్లను గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన, ఎలాంటి గుర్తులు పడని స్క్రీన్ గార్డులు వాడాలి.
- అవకాశం ఉన్నవాళ్లు ఓటీపీలు పొందేందుకు ప్రత్యేంగా ఓ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ సిమ్‌ను స్మార్ట్ ఫోన్‌లో కాకుండా చిన్న బేసిక్ ఫోన్ ద్వారా వినియోగించాలి.

## చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే కూనంనేని



ధర్నాలో ప్రసంగిస్తున్న కూనంనేని సాంబశివరావు

**ధర్నాచౌక్, జూలై 27,ప్రభాతవార్త:** చేనేత కార్మికులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మగ్గ నడవాలి-నేతన్న బతకాలి అనే నినాదంతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిధిగా హాజరై కూనంనేని మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత అత్యధిక జనాభా ఆధారపడి జీవిస్తున్న రంగం చేనేత రంగమని, అటువంటి చేనేత రంగంలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు విద్యుత్, గ్యాస్ సబ్సిడీతోపాటు పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మూత పడిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో చేనేత కార్మికుల సమస్యలను ప్రస్తావించి, వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెకుపల్లి సీతారాములు చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఆత్మహత్యలను నివవారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వారికి సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఆడెపు భాస్కర్, దామోదర్, లక్ష్మీనారాయణ, మధు గౌడ్, సురేష్, శంకర్, సిరిసిల్ల నవీన్, చిలక రాజేశం, సీపీఎం నేతలు భూపాల్, స్కైలాబ్‌బాబు మరియు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## గంజాయి అమ్మకాలు చేస్తే కఠినంగా అణిచివేస్తాం

**-ఎన్‌పోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి హెచ్చరిక**

**గోషామహల్, జూలై27 ప్రభాతవార్త:**
దూల్‌పేటలో భారీగా గంజాయి పట్టుకున్నామని ఎక్సైజ్ ఎనోఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు.వాటి సుమారు10లక్షలపైగా విలువ చేసే 54కేజీల గంజాయిన్ని తరలిస్తుండగాపట్టుకున్నారు.ఆగస్టు31 నాటికి గంజాయి ఫ్రీ దూల్‌పేట చేస్తామన్నారు.గుడంబా నిర్మూలన తరువాత గంజాయి అమ్మకాలు దూల్‌పేటలో విచ్చల విడిగా పెరిగిపోయాయన్నారు.కింది స్థాయి అధికారులను ఉన్నతస్థాయి అధికారుల వరకు దూల్‌పేటలో గత 15 రోజుల నుంచి తనిఖీలు జోరుగా పెంచమన్నారు.దూల్‌పేలో గంజాయి నిర్మూలనేలక్ష్యంగా పెట్టుకుని,పోలీసుల సహాకారంతో ఇంటింటికి తిరిగి తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు.గంజాయి అమ్మకాలు చేసే వాళ్ల అండర్ గ్రౌండ్ వెళ్లే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వారిపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు.తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకుంటున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు.అక్కడి నుంచి దూల్‌పేట కాకుండా నగరంలోని సీతాపల్‌మండి,మైలారం గడ్డ, చిలకలగూడలోని గంజాయిన్ని నిల్వపెట్టుకుని అమ్మకాలు చేస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైనట్లు చెప్పారు.గంజాయి ద్వారా యువత పూర్తిగా బానిసలయ్యే ప్రమాద ముందన్నారు.ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విస్తృతంగా దూల్‌పేటలోనే కాకుండా ఎక్కడైనా గంజాయి అమ్మకాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకుని జైల్ పంపిస్తున్నట్లు చెప్పారు.

# డ్రగ్స్ సరఫరా చేస్తున్న తండ్రీకొడుకుల అరెస్టు

**-రూ. 12లక్షల విలువైన సొత్తు స్వాధీనం..**




నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు..

**నేరెడ్‌మెట్, జూలై27, ప్రభాతవార్త:** డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న తండ్రి కొడుకులను అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు పేర్కొన్నారు. శనివారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలిస్ కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రం, నానా సాహెబ్ ప్రాంతానికి చెందిన సిద్దిక్ సాహా (31) అతని కుమారుడు హనీఫ్ షాహ్ అలియస్ హనీఫ్ (65)లు గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రాజస్థాన్‌కు చెందిన మోంటూ అనే వ్యక్తి దగ్గర 100 గ్రాముల హెరాయిన్‌ను కొనుగోలు చేసి దానిని నగరంలో విక్రయించేందుకు ప్రయతి ్నంచారు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీనా విశ్వసనీయర సమాచారం అందుకున్న మహేశ్వరం పోలీసులు బాలాపూర్ పోలీసులతో కలసి బాలాపూర్ ఇమ్రాన్ అపార్టుమెంటు వద్ద తండ్రి కొడుకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ. 12లక్షల విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ఓ.యూలో కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మలు దగ్ధం

తార్నాక, జులై 27 ప్రభాతవార్త: బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి వివక్ష చూపాంని ఆరోపిస్తూ శనివారం టీపీసీసీ అధికార ప్రతినిది చెనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఓ.యూలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చెనగాని దయాకర్ మాట్లాడుతూ మోడి రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్ సాక్షిగా వ్యతిరేకించారని ఆరోపించారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏమిచేశారని ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోద ఎందుకు ఇవ్వలేదన్నారు. కేంద్రం నుంచి రావలసిన కేంద్ర విద్యాలయాలు ఎందుకు రాకుండా చేశారని ఆరోపించారు. కొత్త జిల్లాలలకు రైల్వే ప్రతిపాదిక లేదన్నారు. విద్యా, వైద్యపై రాష్ట్రానికి మొండి చేయిచూపించారన్నారు. ఐఐఎం కోసం మంత్రులు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురాని మంత్రులను తెలంగాణలో తిరగనియ్యమని చెనగాని దయాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సేవలు అందించటమే లక్ష్యం

**-ముషీరాబాద్ ఎమ్మార్వోగా బాధ్యతలు తీసుకున్న రాణాప్రతాప్‌సింగ్**

**ముషీరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ముషీరాబాద్ మండల పరిధిలోని పేద ప్రజలకు అవసరమైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తానని ముషీరాబాద్ ఎమ్మార్వోగా బాద్యతలు స్వీకరించిన రాణాప్రతాప్‌సింగ్ స్పష్టం చేశారు. శనివారం మండల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ్‌పేట్ నుండి బదిలీపై వచ్చి, ముషీరాబాద్ ఎమ్మార్వోగా బాద్యతలు చేపట్టిన తాను ప్రజల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానని, పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వేగవంతం పూర్తి చేస్తానని తెలిపారు. స్థానిక ప్రజలందరూ కూడా సహక రించాలని విజ్ఞప్తి చేశారు.

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ముషీరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ముషీరాబాద్ మండల పరిధిలోని లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, తహసీల్దార్ కొర్రా రాణాప్రతాప్‌సింగ్‌లు అందచేశారు. శనివారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో 63 మందదిదకి కళ్యాణ లక్ష్మి, 159మందికి షాదీ ముబారక్ చెక్కులను వారు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులై న పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## వినూత్నమైన ఉత్పత్తులను అందించడమే లక్ష్యం

శామిర్‌పేట జూలై27,ప్రభాతవార్త : కేశాల ఉత్పత్తులలో నాయకుడిగా కొనసాగుతున్న వీట్ తమ సాటిలేని కొత్త శ్రేణి వీట్ ప్యూర్‌ను ప్రత్యేకమైన కార్యక్రమంలో విడుదల చేసింది.ఈ కార్యక్రమానికి నటుడు సారా అలీ ఖాన్ హాజరై సౌందర్య ఔత్సాహికులు ,ప్రేక్షక ప్రభావితదారులు సమక్షంలో ఉత్పత్తిని విడుదల చేశారు.ఈ వినూత్నమైన ఉత్పత్తి శ్రేణి వీట్ కోసం గణనీయమైన విజయంగా నిలుస్తుందని అన్నారు.



## మాజీ మంత్రి జెపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

**తలకొండపల్లి,జులై 27 ప్రభాతవార్త :** ఆదివారం మాజీ కేంద్ర మాజీ మంత్రి కీర్తిశేషులు సూదిని జెపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం మరియు కల్వకుర్తిలో పట్టణ కేంద్రంలో బిఎస్ఎన్ఎల్ ప్రాంగణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు మొదటి సారిగా నియోజకవర్గానికి విచ్చేస్తున్న సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి స్వాగతం తెలుపు తూ ఈ సభకు జెపాల్ అభిమానులు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయ వంతం చేయాలని గట్టుఇప్పలపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదే రేణురెడ్డి పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్ర మంలో గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి శంకర్ మచ్చేందర్ శివకుమార్ పవన్ వాల్మీకి దేశముని రాములు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందజేత



**తలకొండపల్లి,జులై 27 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో గుండె మోని నరసింహ మరణించడం జరిగింది. శనివారం నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ 3000 రూపాయల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జోతయ్య సింగిల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్ యాదవ్ మాజీ వార్డు మెంబర్స్ ఈశ్వర్ యాదయ్య రవికుమార్ దశరథ సజు పాష పాండు యాదవ్ జంగ య్య కుమార్ రాజు నారాయణ రవితేజ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో బోనాల పండుగకు ఏర్పాట్లు పూర్తి

**బోడుప్పల్, జులై 27 (ప్రభాతవార్త) :** బోడుప్పల్ పట్టణంలో బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేశారు. బోడుప్పల్‌తోపాటు, పీర్జాదిగూడ నగర పరిధిలోని పర్వతాపూర్‌లో సైతం ఆదివారం బోనాల పండగ జరుపుకుంటున్నారు. బోడుప్పల్‌లోని బంగారు మైసమ్మ ప్రధాన దేవాలయంతోపాటు పలు కాలనీలలోని అమ్మవార్ల దేవాలయాల వద్ద నగర పాలక సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. పర్వతాపూర్‌లోని పలు దేవాలయాల వద్ద నగర పాలక సంస్థవారు పారిశుధ్య పనులను చేపట్టారు. అదే విధంగా పీర్జాదిగూడలోని 10వ డివిజన్, 6వ డివిజన్, 19వ డివిజన్‌లలో బోనాల పండుగ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## రత్నదీప్‌లో పాడైన ఉల్లిపాయలు అమ్మకానికి...

**బోడుప్పల్, జులై 27 (ప్రభాతవార్త) :** కొన్ని వ్యాపార సంస్థలు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా నాణ్యతలేని వస్తువులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బోడుప్పల్‌లోని ప్రముఖ సూపర్ మార్కెట్ రత్నదీప్ స్టోర్‌లో ఈ తరహా వ్యవహారం బయటపడింది. పాడైపోయిన ఉల్లిపాయలను విక్రయిస్తున్నారు. ఇక్కడ పనిచేసేవారికి సైతం మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు లేవు. అదే విధంగా సికింద్రాబాద్, రాంపల్లిలోని బ్రాంచిలలో సైతం అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు.

## ప్రకృతి పరిరక్షణకై మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న వీరమోని దేవేందర్‌ముదిరాజ్

**కొత్తూర్, జులై 27, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు విధిగా ఆక్సిజన్ అందించే చెట్లను పెంచి ప్రోత్సహించాలని కొత్తూర్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం సందర్భంగా శనివారం కొత్తూర్ పురపాలికలో కౌన్సిలర్ హేమదేవేందర్‌ముదిరాజ్ ఇంటింటికి ఉచితంగా మొక్కలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమం గొప్ప సంకల్పమని అన్నారు. అందులో భాగంగా కౌన్సిలర్ హేమదేవేందర్‌ముదిరాజ్ కొత్తూర్ మున్సిపాలిటీ 6వ వార్డులోని ప్రతి ఇంటికి సీడ్ మొక్కలను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన విధి అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. చెట్లు మనిషి మనుగడకు ఎంతో ముఖ్యమని ప్రజలకు ఆయన తెలియజేశారు. రాబోయే రోజుల్లో చెట్లు లేకుండా ఉంటే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు తదితరులు ఉన్నారు.

## సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాంపులో పాల్గొన్న శ్రీసత్యసాయి భజనే మండలి భక్తులు

**కొడంగల్,జులై 27ప్రభాతవార్త** సత్యసాయి భజన మండలి రుద్రారం,తాండూర్ సమితి అధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు సహకారంతో హైద్రాబాద్ డాక్టర్ శైలజ నీలోఫర్ డాక్టర్ ప్రసాద్, క్యాంపు కోఆర్డీనేటర్,పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 100 మందికిపైగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు.క్యాన్సర్ నిర్ధారణ అయినచో హైద్రాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రోగులను తరలించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సంస్థల స్టేట్ మెడికల్ కోఆర్డీనేటర్ భాస్కర్‌రావు, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్‌సింగ్ ఠాగూర్,సమితి కన్వీనర్ వీరేశం,రుద్రారం మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డిలతో పాటు సేవాదల్ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### బాలికలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

బాలికలకు మెరుగైన విద్యే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంపీ మల్లికా ర్జునరెడ్డి తెలిపారు. బిబిజి టాలెంట్ ఫ్యాక్టరీ అవార్డుల వేడుక నార్సింగిలో ఓ కన్వెన్షన్‌లో ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటి రాశి సింగ్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. బిబిజీ అసోసియేట్స్ నుంచి పది లక్షలు మేనేజ్‌మెంట్ నుంచి ఇరవైలక్షల చెక్కును బిబిజి ఫౌండేషన్‌కు రాశిసింగ్ ద్వారా ఇచ్చారు.

# అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయం




మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 27, ప్రభాత వార్త:** దేశం గర్వించే శాస్త్రవే త్తగా, విద్యావేత్తగా రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీ యమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్ గ్రామంలో శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఎం పీపీ మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ యువతలో స్ఫూర్తిని నింపిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాంయని అన్నారు. మారుమూల గ్రామం నుండి దేశ ప్రథమ పౌరుడిస్థాయికి ఎదిగిన తీరు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నా యకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, ముద్దం లక్ష్మణ్ యాదవ్, మల్లేశ్, రాజశేఖర్ రెడ్డి, రఘురాం రెడ్డి, సదానంద రెడ్డి, సందీప్, భాను యాదవ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.




అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

### అవుశాపూర్‌లో..

**చౌడపూర్ జులై27,ప్రభాతవార్త :** మాజీ రాష్ట్రపతి డా.ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా చౌడపూర్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేపర్ బాయ్ నుండి ప్రెసిడెంట్‌గా ఎదిగిన కలాం జీవిత చరిత్రను భారత యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెవ్వ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ ,భీలు,వెంకటేష్, యువజన సంఘాల నాయకులు సంపత్,శివ, శీను,శంకర్, రామకృష్ణ,దస్తగీర్, బ్రహ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.



బోనాల పండుగ సందర్భంగా పోతురాజుల వేశాదారణలో నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**కీసర,జులై27,ప్రభాతవార్త:** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నాగారం సెరినిటి పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. శనివారం నాగారం సెరినిటి పాఠశాలలో విద్యార్థులు అత్యంత వైభవంగా, కోలాహలంగా బోనాల పండుగను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బోనాలు తెలంగాణ రాష్ట్రం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం, మహంకాళీ మాత భక్తికి నిదర్శనంగా నిలుస్తాయని పేర్కొన్నారు. హిందువులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ పండుగ జరుపుకుంటారని ప్రజల మద్య ఐక్యత,సంఘీభావ బంధాన్ని బలపరుస్తాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు అమ్మవార్లుగా,పోతురాజులుగా,శివసత్తులుగా,పులి వేషధారణలో వివిధ రూపాల్లో కనువిందు చేశారు.విద్యార్థులు నిర్వహించిన బోనాలు నృత్య ప్రదర్శనలు అహుతులను,విద్యార్థుల తలిదండ్రులను,ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సెరినిటీ పాఠశాల కార్యదర్శి నోముల వసంత,నాగారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అహ్మద్‌గూడలో..



అహ్మద్‌గూడలో కాటమయ్య బోనాలు ఎత్తుకెలుతున్న కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

**కీసర,జులై27,ప్రభాతవార్త:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని అహ్మద్‌గూడ గ్రామంలో శనివారం కాటమయ్య,మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించినట్లు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీవాసులు అందరూ ఉత్సాహంగా ఉల్లాసంగా ఈ బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారని ఆమే తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా కాటమయ్య దీవెనలు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గంది శ్రీనివాస్‌గౌడ్,నర్సింహ్మాగౌడ్,ముత్యం గౌడ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మోరు తల్లి అందర్నీ చల్లంగా చూడాలి

### బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపిపి ప్రియాంక

**నందిగామ,జులై 27 ప్రభాతవార్త :** ఆషాడ మాసంలో జరుపుకునే బోనాల పండుగ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని నందిగామ మండల తాజా మాజీ ఎంపిపి ఎం ప్రియాంక శివశంకర్‌గౌడ్ ఆకాంక్షించారు. బోనాల పండుగ సందర్భంగా ఆమె నందిగామ మండల ప్రజలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి దీవెనలతోపాటు మంచి జరగాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సిరిసంపదలతో పిల్లపాపలతో సుఖ సంతోషాలు ఉండేలా దీవించమని ఆమె అమ్మోరు తల్లిని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి

### బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి

**మొయినాబాద్,జులై 27 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి గణేష్‌పై శుక్రవారం తెల్లవారుజామున దాడికి పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన గణేష్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులపై జరిగిన దాడి వెనుక స్థానికంగా కొందరి కుట్ర దాగి ఉన్నట్లు ఆరోపించారు. దాడి వెనుక అసలు సూత్రధారులను పోలీస్‌శాఖ సమగ్ర విచారణ చేపట్టి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

**కేశంపేట,జులై 27, ప్రభాతవార్త** దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశంపేట ఎస్సై రాజ్‌కు మార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 10న గుర్తుతెలియని వ్యక్తి ఆలయంలో హుండీలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అన్నారు. ఆదివారం దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని మంగలిగూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్ల నరసింహగా గుర్తించి అతనిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



నియామక పత్రాన్ని అందజేస్తున్న పత్తి కుమార్

**మేడ్చల్, జులై 27, ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సి పల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దండు శ్రీకాంత్ ఎన్నికయ్యాడు. మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ శనివారం శ్రీకాంత్‌ను ఎంపిక చేస్తూ అతనికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియో జవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్, నాయకులు గ్యార శంకర్, పత్తి శంకర్, లవంగు రాకేష్ పాల్గొన్నారు.



## సామా ఎంక్లేవ్‌లో అధ్వానంగా రోడ్లు

### ఇబ్బందులు పండుతున్న వాహనదారులు, విద్యార్థులు

**శంషాబాద్,జులై 27 ప్రభాతవార్త :** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని సామా ఎంక్లేవ్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. అసలే వర్షాకాలం కావడంతో గుంతలలో వర్షపు నీళ్లు నిలిచి మరింత అధ్వానంగా మారాయి. వాహనాలపై ప్రయాణించడం అటు ఉంచితే కనీసం కాలినడకన కూడా నడిచే పరిస్థితి లేదు. సామాన్లు ప్రధాన రోడ్డులో పలు అపార్ట్మెంట్‌లతో పాలు విద్యాసంస్థలు కూడా ఉండడంతో వాహనాలు పాదచారులు నిరంతరం తిరుగుతూ ఉంటారు. స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీ నుంచి లక్షలాది రూపాయల టాక్స్‌లు చెల్లిస్తున్నప్పటికీ కనీసం రోడ్డు వసతి కూడా కల్పించపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## లక్ష్మీ నర్సింహ్మా స్వామి దేవాలయం చైర్మన్‌గా ఈఓ శ్రీనివాస్

**కొందుర్గు, జులై 27, (ప్రభాతవార్త) :** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నర్సింహ్మా స్వామి దేవాలయం చైర్మన్‌గా చేవేళ్ల కృష్ణను దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారి చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ తెలిపారు. దేవాలయం చైర్మన్‌గా చేవేళ్ల కృష్ణయ్య, డైరెక్టర్లుగా సీలం వేణుగోపాల్, బోజిగారి అనిత, తూప్పుగూడెం మాధవరెడ్డి, బోయ చిన్న నర్సింలు, జెగ్గమొల్ల బాల్‌రాజ్, చిప్పఅమర్‌లింగంలను నియమించినట్లు వివరించారు. త్వరలోనే దేవాలయం ఆవరణలో కొత్త కమిటీ సభ్యులను ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఈఓ తెలిపారు.

## వరద బాధితులకు పరామర్శ



మహారాష్ట్రలో వరద బాధితులను పరామర్శిస్తున్న కృష్ణంరాజు

**కొడంగల్,జులై 27ప్రభాతవార్త** మహారాష్ట్ర రాష్ట్రం వార్ధా జిల్లాలో వరద బాధితులను కొడంగల్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నేషనల్ కోఆర్డీనేటర్ కృష్ణంరాజు పరామర్శించారు.శనివారం వార్ధా ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి శేఖర్ ప్రమోద్ షిండే,అసెంబ్లీ ప్రెసిడెంట్ సౌరభ్ తదితరులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కలి ్పంచారు.కురుస్తున్న వర్షాలకు డ్యాంలలో వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## ఆలయ విస్తరణలో ఇళ్ళ బాధితుల వివరాల సేకరణ



ఇళ్ళు కోల్పోతున్న వారి వివరాలను సేకరిస్తున్న అధికారులు

**కొడంగల్,జులై 27ప్రభాతవార్త** పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణకు సంభందించిన పనుల్లో భాగంగా నివాసాలు కోల్పోయే వారి పేర్లను నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా శనివారం రెవెన్యూ,దేవాదాయశాఖకు సంభందించిన సిబ్బంది పట్టణంలోని బాలాజీనగర్,కుమ్మరివాడలో ఇంటింటికి తిరిగి బాధితుల పేర్లను నమోదు చేసుకున్నారు.ఆలయ విస్తరణకు సంభం దించి మొత్తం 5 ఎకరాల స్థలం కావాల్సి ఉండగా ఇందులో నివాసం ఉంటున్న మొత్తం 86 మంది ఇళ్ళను కోల్పోతున్నట్లు తెలిపారు.ఈ 5 ఎకరాల్లో ఆలయ ప్రహరి,ఇతరాత్ర పనులు కొనసాగుతాయని ఆలయ ఈఓ నరేందర్ తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేందర్,సర్వేయర్ మురళీధర్‌చారి,రెవెన్యూ సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 29న సిపిఐ కౌన్సిల్ సమావేశం

**శామీర్‌పేట, జులై 27, ప్రభాతవార్త** ఈ నెల 29వ తేదీన శామీర్‌పేట ఉమ్మడి మండల సిపిఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు. శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి మండలం సిపిఐ నాయకుల, కార్యకర్తల సమావేశం శామీర్‌పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల సిపిఐ నాయకులు నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాలని డిజి సాయిలుగౌడ్ కోరారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## ఆర్థిక సాయం అందజేసిన మాజీ జడ్పీటిసి

**కడ్తాల్,జులై 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించిన రాధాకృష్ణ చారిటుబుల్ ట్రస్టు ఛైర్మన్, కడ్తాల్ మండల మాజీ జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ శనివారం సలార్పూర్ గ్రామానికి చెందిన ఎల్లమ్మ, నేనావత్ సోమ్య, కేతావత్ చంద్రు, నేనావత్ కిషన్, సజిలకు రూ. 25 వల ఆర్థిక సహాయం అందజేశారు. గోవిందపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గోవిందాయపల్లి తండాకు చెందిన నేనావత్ జగ్రామ్, నేనావత్ ధర్మి, సభావత్ వాచ్చు, సభావత్ నాజీ, సభావత్ పిక్లి, సభవత్ బిక్కు, సభావత్ నాజీ, సభావత్ పిక్లి, సభావత్ బిక్కు సభావత్ నాజీ కుటుంబాలకు రూ. 25 వేలు అందజేశారు. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన మాసనోళ్ల మణెమ్మకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని మొత్తం 13 మంది మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగిస్తూ ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున రూ. 65 వేలు అందజేశారు. మండలంలోని నిరుపేద కుటుంబాలకు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని అదేవిధంగా భవిష్యత్తులో మా ట్రస్టు సేవలు నియోజకవర్గ స్థాయిలో విస్తరించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమం లో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రైతు కో ఆర్డినేటర్ వీరయ్య, మాజీ ఎంపిపి సువాలిపంతు, మాజీ ఎంపిటిసిలు సాయిలు, ప్రియా రమేష్, మాజీ సర్పంచ్ శత్రునాయక్, నాయకులు లాయక్ అలీ, మంగళపల్లి నరసింహ, బాబా శ్రీశైలం, నరేష్, ఆమ్‌జిత్, నరేష్, కృష్ణయ్య, రాజు, యాది, హాజి, చంద్రు, గోపాల్, జైపాల్, రామచంద్రయ్య, పాండు, సేవ్యా శివరాం, పండు, బిక్షపతి, చందు, అంజి, శ్రీకాంత్, వినోద్ రాజేందర్ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

### మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మి నర్సింహారెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**కడ్తాల్,జులై 27 ప్రభాతవార్త :** ఉద్యోగంలో బదిలీలు సర్వసాధారణమని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాల్గొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థుల భవితవ్యానికి ఉపాధ్యాయులు అందించిన సేవలు వెలకట్టలేనివని, పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. అనంతరం పాఠశాలలో విశేషమైన సేవలందించి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు సుగుణాదేవి, మాలతి, భాగ్యరేఖ, రేణుక, స్నేహలత, అలివేలు, సుజాత, జయంతి, రమాదేవిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నూతనంగా జిల్లా పరిషత్ పరిషత్ బాలికల పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థుల భవితవ్యానికి తమవంతు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

## నూతన తహశీల్దార్‌ను సన్మానించిన మండల నాయకులు




కోట్‌పల్లి నూతన తహశీల్దార్ మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మండల నాయకులు

**కోట్‌పల్లి, జులై 27, ప్రభాతవార్త;** కోట్‌పల్లి ఇక్కడ విధులు నిర్వహించిన తహశీల్దార్ ఆశాజ్యోతి సంగారెడ్డికి బదిలీపై వెళ్లడంతో పెద్దేముల్ మండలంలో పని చేసిన మహేష్‌కుమార్ కోట్‌పల్లి తహశీల్దార్‌గా వచ్చారు. దింతో మండల నాయకులు శనివారం నాడు కోట్‌పల్లి తహశీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ మత్స్యశాఖ చైర్మన్ నక్కల బందయ్య, మాజీ సర్పంచు శివనందం, వికారాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, నాయకులు వెంకటయ్య, మహేందర్‌దొర, విఠల్‌గౌడ్, భీమయ్య, బండి నర్సిములు, పద్మారావు, సత్తార్, కిష్టయ్య, రమేష్‌లు కలిసి సన్మానించారు.

## రేగడిమైలారంలో బంగారునగలు దొంగతనం



**బొంరాస్‌పేట్,జులై27,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం రేగడిమైలారం గ్రామంలో శుక్రవారం రాత్రి తాళం వేసిఉన్న ఇంట్లో తాళం విరగొట్టి దొంగలు దొంగతనం చేశారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగడిమైలారం గ్రామం వ్యవసాయ కుటుంబానికి చెందిన గొల్ల శేఖరయ్య తండ్రి నర్సయ్య వయస్సు(60) ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగిందని ఇంట్లో ఉన్న బీరువా లో ఉంచిన 95వేల రూపాయాలు,1 తులం బంగారు గొలుసు,3రింగులు తులం నర,కమ్మల బుట్టాలు అద్దతులం మొత్తం 3తులాల బంగారంను దొంగలు అపహ రించినట్లు వారు తెలిపారు.ఈ సంఘటనపై బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి ఈ విషయంపైన కేసు నమోదు చేసినట్లు స్థానికులు తెలిపారు.

## నాటుసారా తయారు చేస్తున్న వ్యకిపై కేసునమోదు



**పెద్దేముల్,జులై27,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి ఆదేశాల ప్రకారం పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామశివా రులో జాదవ్ చందర్ అనే వ్యక్తి తన వ్యవసాయ పొలంలో నాటుసారాను తయారు చేస్తున్నడనే పక్క సమచారంతో శుక్రవారం ఎస్ఐ గిరి తమ సిబ్బంది,జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీస్‌లు సంయుక్తంగా దాడిచేయగా అక్కడ 15లీటర్ల నాటుసారా,నవసగరం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 2బ్యాలర్లలో నిల్వ ఉంచిన 150 లీటర్ల బెల్లం పానకంను స్వాధీనం చేసుకొని చందర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని,ఎవరైన నాటుసారాను తయారు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే అలాంటి వారిపై కేసు నమోదు చేసి చట్టపర్మైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు పాల్గొన్నారు.

## నేడు ఎన్ఎఫ్‌సీనగర్‌లో బోనాలు

**ఘట్‌కేసర్, జులై 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిదిలో ఆషాడం బోనాల ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడలో ఆదివారం బోనాల ఉత్సవాలు జరుగనున్నాయి. ఎన్ఎఫ్‌సీనగర్‌లో చిత్తారమ్మ, పోచమ్మ దేవాలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో బోనాల పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ బోనాల అనంతరం మొదటగా ఎన్ఎఫ్‌సీనగర్‌లో బోనాల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.చందుపట్లగూడ, బొక్కోనిగూడలోని గ్రామదేవతలు పోచమ్మ, మహంకాళీ, మైసమ్మ అమ్మవార్ల దేవాలయలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహకులు అలంకరించి ఏర్పాట్లుచేస్తున్నారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమా దేవి, బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బోనాల సందర్భంగా ఆలయాల పరిసరాలను, కాలనీల్లో పరిశుభ్రత పనులు చేయించి తగిన ఏర్పాట్లు చేశారు.

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఆమనగల్లు, జూలై27, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలంలో పనిచేస్తూ పదోన్నతులు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు శనివారం స్థానిక మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఘన సన్మానం లభించింది. పట్టణంలోని వాసవి కళ్యాణి గార్డెన్స్ ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం కోలాహలంగా సాగిపోయింది. పనిచేసిన చోట తమకు ఎదురైన జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల బృందం హాజరైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమ సమావేశంలో ఎంఈఓ సర్దార్‌నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి గొప్పతనాన్ని వివరిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పాటునందించే వృత్తులలో విద్యావ్యవస్థ అతి కీలకమైనదని ఆయన తెలిపారు. సమాజంలో మార్పులు, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రక్రియలో విద్యా ప్రధాన భూమిక వహిస్తుందని చెప్పారు. సమాజంలో కలకాలం కీర్తించబడేది కేవలం ఉపాధ్యాయ వృత్తేనని కొనియాడారు. విద్యతోనే విశ్వం ఆధార పడి ఉంటుందని, అందులో ఉపాధ్యాయుల కృషితోనే ఎంతో గణనీయమైనదిగా అభివర్ణించారు. సమాజానికి కావలసిన అన్ని వృత్తులను తయారు చేసేది కేవలం విద్యారంగమేనన్నారు. అందివచ్చిన అవకాశాలను ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ పనిచేసే చోట ప్రజల హృదయాలను గెలుచుకుంటే చిరకాలం ప్రజల చేత కీర్తింపబడుతారని సూచించారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయ బృందానికి పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి : ఎంపీడీవో అపర్ణ



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

**షాబాద్, జూలై 27, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, మానవాళి మనుగడకు మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొ క్కలు నాటాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీవో వీరాసింగ్, హెచ్ఎం యామిని, పంచాయతీ కార్యదర్శి అనిత ఉన్నారు.

## ధరణి పెండింగ్ ఫైళ్లు పూర్తి చేశాం : ఆర్‌డిఓ

**చౌటకూరు, జులై 27, ప్రభాతవార్త:** మండలంలో పెంగింగ్‌లో ఉన్న 334 ధరణి పెండింగ్ ఫైళ్లను పూర్తి చేయడం జరిగిందని అందోల్ ఆర్‌డిఓ పాండు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన చౌటకూరులోని రెవిన్యూ కార్యాలయాన్ని ఆర్‌డిఓ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాల యంలోని రికార్డులను ఆర్‌డిఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ పాండు మాట్లాడుతూ ధరణి పెండింగ్ ఫైళ్లను పూర్తి చేసిన అధికారులకు ఆర్‌డిఓ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు



**నాగల్‌గిద్ద, జులై 27, ప్రభాతవార్త:** మండలంలోని కారముంగి గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వన మహోత్సవ కార్యక్ర మాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రావు మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షిస్తూ చెట్లుగా పెరిగేలా చర్యలు తీసు కోవాలని విద్యార్థులకు సూచించారు. చెట్లతో కలిగే ప్రయోజనాలపై రవీం దర్‌రావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మిగిలిన ఆహార పదార్థాలు బయట వేయవద్దు

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్,జూలై27,ప్రభాతవార్త** మద్యాహ్న భోజనంలో మిగిలిన ఆహార పదార్థాలను విద్యార్థులు ఆరు భయట పడవేయవద్దని మున్సిపల్ చైర్‌ప ర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు.శనివారం పట్టణంలోని 11వవార్డులోని ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తిన్న తరువాత మిగిలి పోయిన అన్నం,కూర లాంటివి భయట పడవే యడం వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు.పాఠశాలలో మున్సి పాలిటీ ఆధ్వర్యంలో ఒక డ్రంబ్ ఏర్పాటు చేయించారు.విద్యార్థులు మిగిలిన ఆహారాన్ని భయట పడేవేయకుండా అందులో వేయాలపి సూచించారు.ఇలా వేయడం వల్ల వేసిన పదార్థాలు 90 రోజుల్లో కంపోస్టు ఎరువుగా మారుతాయని ఎరువుగా మారిన తర్వాత దానిని తీసుకుని పాఠశాలలో పెరిగిన చెట్లకు వాడుకోవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, శానిటరీ ఇన్స్ పెక్టర్ బాల ఎల్లం,వనమహోత్సవ సూపర్‌వైజర్ జాలిగం శంకర్,పర్యావరణ అధికారి రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోగ్రాం ప్రొఫైల్ ప్రాజెక్టులో ఆదర్శ పాఠశాలకు మొదటి బహుమతి

**హుస్నాబాద్,జూలై27,ప్రభాతవార్త** బిజినెస్ ఇన్నోవేటర్ ప్రోగ్రాం ప్రొఫైల్ ప్రాజెక్టులో హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు మొదటి బహుమతి లభించింది.శనివారం రోజున సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో మొదలైన అంకురం బిజినెస్ ఇన్నోవేటర్ ప్రోగ్రాం పైలెట్ ప్రాజెక్టులో దాదాపు 35 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ఆదర్శ పాఠ శాల విద్యార్థులు ప్రదర్శించిన మల్టీ అప్లయెన్స్ రిమోట్ స్విచ్ ఐడియా విభా గంలో మొదటి బహుమతి దక్కింది.ఈ సందర్భంగా బహుమతి సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పి అన్నపూర్ణ,ప్రోగ్రాం గైడ్ టీచర్లు అశోక్,కృష్ణతో పాటు అధ్యాపక బృధం అభినందించారు.

## కంది సెంట్రల్ జైలును పరిశీలించిన న్యాయమూర్తి

**సంగారెడ్డి టౌన్, జులై 27, ప్రభాతవార్త:** జాతయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి రమేష్ పరిశీలించి న్యాయంపై అవగాహన కల్పించారు. జైలు పరిసరాలను, వంట గదిని న్యాయ మూర్తి పరిశీలించారు. ఖైదీలకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ఖైదీలకు కల్గుతున్న ఇబ్బందుల గురించి న్యాయమూర్తి అడిగితెలుసుకున్నారు. జైలు ఆవరణలోని స్టార్ రూం, వాస్ రూం, వంట గది, వసతి గృహాలను తనిఖీ చేశారు. జైలు సూపరిండిటెండ్‌కు న్యాయమూర్తి పలు సూచనలు చేశారు.



# సమన్వయంతో పనిచేద్దాం.. ప్రభుత్వ ఆశయాలను నెర్చుదాం

## కాంగ్రెస్ కార్యకర్తలకు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పిలుపు

**కందుకూరు, జులై 27, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేసి విజయఢంఖా మోగించాలని మాజీ శాసనసభ్యులు మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. శనివారం కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మండల పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కోర్పోలు రాణాప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతు తెలంగాణ ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ అధికారం ఇచ్చారని ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చొరవచూపాల్సిన భాద్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపైన ఉంటుందన్నరు. ప్రజలకు చేరువై ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే కార్యకర్తకు ప్రజల ఆశీర్వాదాలు ఉంటాయని నాయకునిగా ఎదగడానికి అవకాశం ఉంటుందని సూచించారు. రాబోయే రోజులు అతికీలకమైనవని స్థానిక సంస్థలలో విజయంసాదిస్తే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే అవకాశాలు ప్రజలు మేలుజరే పరిస్థితులు ఉంటాయని సూచించారు. పార్టీ పరంగా సంస్థాగతంగా బలోపేతం కావడానికి గ్రామకమిటీలు, మండల కమిటీలు కలిసి పనిచేయాలని పనిచేసే నాయకులకు కార్యకర్తలు తగిన గురింపు ఉంటుందన్నరు. పనితీరును బట్టే పార్టీ పదవులు ఉంటాయని అందరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. గ్రామాల వారిగా పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు నాయకులు పనిచేయాలని సూచించారు. మండలంలో కొన్ని గ్రామాలలోనే గ్రామకమిటీలు ఉన్నాయని మిగతా గ్రామాలలో కమిటీలు వేయాలని అదేవిదంగా మండల కమిటీనీ త్వరలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలా అయితేనే లక్ష్యాలను సాదించేఅవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రౌండ్ స్థాయిలో పనిచేసే వారికి పాతకాపులను జిల్లా కమిటీలకు పంపి మండల స్థాయిలో గ్రామస్థాయిలో యువతకు ప్రాదానం ఇవ్వాలని గ్రామస్థాయిలో ఉండే కార్యకర్తలకు ప్రాదాన్యత ఇవ్వాలని ఇతర పార్టీల వారిని చేర్చుకునే సమయంలో గ్రామ స్థాయి నాయకత్వానికి ప్రాదాన్యత ఉండాలా చూడాలని సూచించారు. ఈ విషయమై కార్యకర్తల మనోబావాలు తెలుసని కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఏపార్టీల వారు రావాలన్నా అయా గ్రామాల కమిటీల సమక్షంలోనే తీసుకోవడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున మండల కమిటీ ఏర్పాటుకు ప్రాదాన్యత పెరిగింది మెజారిటీ సభ్యులు ముందుకు రావడంతోవారివారి పేర్లను ప్రతిపాదనలోకి తీసుకుని కార్యకర్తల అభిప్రాయం మేరకు వారం రోజుల తరువాత ప్రకటించడం జరుగుతుందని లక్ష్మారెడ్డి తెలిపారు. అనంతరం మండల పరిదిలోని నేదునూరు గ్రామంలోని అదర్శ పాఠశాలకు వెల్లి పాఠశాలఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు రావడానికి దారి బాగలేదని విద్యార్థులు సూచించగా స్వంత ఖర్చుతో రోడ్డు బాగుచేయిస్తానని హామీఇచ్చారు. అదేవిదంగా గ్రామస్తుల విన్నపం మేరకు అ గ్రామంనుండి అయా గ్రామాలకు వెల్లే రోడ్లను వేయించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు బి జంగారెడ్డి, ఎ జంగారెడ్డి, మాజీ ఎంపిపి మహేష్‌గౌడ్, కె పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, సులేమాన్‌అఫ్జల్‌బేగ్, వెంకట్రాంరెడ్డి, వీరారెడ్డి, మల్లేష్, జగన్, సాయిలు, వీరేష్, మదన్‌పాల్‌రెడ్డి, వెంకటేష్, హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అయా గ్రామాల మహిళా నాయకురాల్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ముక్తాపూర్‌లో బీటలు బారుతున్న విద్యుత్ కార్యాలయ భవనం

## బీటలు బారుతున్న విద్యుత్ కార్యాలయ భవనం

### కొత్త భవనం నిర్మించాలని విన్నపం

**నాగల్‌గిద్ద, జులై 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముక్తాపూ ర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ భవనం బీటలు బారింది. చిన్న పాటి వర్షం కురిసినా టప టప మంటూ నీరు కారడం, భారీ వర్షం కురిస్తే ఎక్కడ కూలిపోతుందో అన్న భయంతో అధికారులు, ఆపరేటర్లు కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్నారు. 1990లో నిర్మించిన భవనం అప్పుడే బీటలు బారుతోందంటే అప్పట్లో భవనాన్ని నాణ్యత లేకుండా నిర్మించారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుం డా వర్షాలు కురుస్తుండటంతో ఆపరేటర్లు కార్యాలయంలో పనులు చేసుకు నేందుకు పడుతున్న పట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ఆపరేటర్లు పనులు చేసుకునేందుకు పాట్లు పడాల్సి వచ్చిన కొంత వరకు ఇబ్బందులను తట్టు కోవచ్చని, అదే పనులు చేసుకుంటుండగా భవనం కూలితే నిండు ప్రాణా లు కలిస్తే ఆ కుటుంబాల పరిస్థితి ఏమటని విద్యుత్ అధికారులు ఆలో చించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి గ్రామంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న కార్యాలయ భవనాన్ని కొత్తగా నిర్మించాలని ఆపరేటర్లు, రైతులు వినతి చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయికి బస్వాపూర్ విద్యార్థి ఎంపిక

**పుల్కల్, జులై 27, ప్రభాతవార్త:** మండలంలోని బస్వాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి పి సంజయ్ రాష్ట్ర స్థాయి సకుర సైన్స్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. శనివారం సకుర జపాన్ కార్యక్రమాన్ని జిల్లాలోని 4 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, 10 మోడల పాఠశాలల, 2 ట్రెస్సిస్ పాఠశాలలు, కళాశాలల నుంచి ఎంపికైన 16 మంది విద్యా ర్థులకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో శనివారం పరీక్షలు నిర్వ హించారు. పరీక్షల్లో జిల్లా నుంచి బస్వాపూర్ విద్యార్థి పి సంజయ్ రాష్ట్ర స్థాయి పరీక్షలకు ఎంపికైయినట్లు అధికారులు ప్రకటించి ఘనంగా సన్మా నించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్ వెం కటే శ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి పి సిద్దారెడ్డి, కార్యక్రమ న్యాయ నిర్ణేత ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, అనురాధ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కేంద్రం నుంచి 8 లక్షల కోట్ల నిధులు

### బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం

**మనూర్, జులై 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం భారతీయ జనతా పార్టీ మండల విస్తృ త స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షులు కె ఈశ్వరప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం ముఖ్య అతిథిగా హాజరై భరత మాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన, ఉచిత రేషన్ బియ్యం, వీధిలైట్లు, సిసి రోడ్లు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రోడ్లు పథకాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి 8 లక్షల కోట్ల రూపాయల నిధులు విడుదలయ అయ్యాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి మద్దతు దారులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేలా ప్రతి కార్యకర్త తన వంతు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు చాకలి అశోక్, విజయ్‌కుమార్, బోరంచ మాజీ ఎంపిటిసి సభ్యులు గొల్ల పాపని రాములు, నారాయణఖేడ్ రామ్ మందిరం మాజీ డైరెక్టర్ రాజగిరి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు జి కృష్ణ, చిలకమ్మ నర్స న్న, మల్లయ్యస్వామి, మైకోడ్ బూత్ అధ్యక్షులు బీరప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ మనుగడకు ప్రతి ఒక్కరం పాటుపడదాం

### బిజెపి అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్నాథం

**ఝరాసంగం, జులై 27, ప్రభాతార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మనుగడకు పత్రి కార్యకర్త తన వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ అసెంబ్లి కన్వీనర్ నౌబాద్ జగన్నాథం అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్య క్షులు బంటు విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగన్నాథం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయనానికి పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు సి బస్వరాజ్, గోపాల్‌గౌడ్, మండల ఉపా ధ్యక్షులు యాదవ్‌రెడ్డి, ప్రశాంత్, కార్యదర్శులు అశోక్, విశ్వనాథ్, నర్సిం లు ఎల్గోయి, పరశురాం, అనిల్, శివారెడ్డి, హరీష్, రోహిత్, భాగ్యరం, తుకారాం, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు వెంటనే ప్రవేశపెట్టాలి : కొమ్ము ఉమేష్

**గజ్వేల్ టౌన్, జులై 27 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని సిద్దిపేట జిల్లా బిసి సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయం తేలిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు అన్యాయం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బిసి జనాభా ప్రకారం ప్రాతినిథ్యం పెరగాలని, బిసిలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిసి బిల్లు ప్రవేశపెట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కన్నా, అక్కారం రాజు, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడి

**గజ్వేల్ టౌన్, జులై 27 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం అంకెల గారడీగా ఉందని జాలిగామ బిఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి చిట్యాల ఎల్లం అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏ అంశాన్ని చూసిన త్వరలో చేస్తాం, త్వరలో హామీలు పూర్తి చేస్తాం అనే మాట తప్ప అమలు చేస్తామనే ప్రస్తావన లేదన్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి కూడా ప్రభుత్వం రూ. 500 గ్యాస్ ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో చెప్పిన విధంగా ప్రభుత్వ ఉద్యో గులకు ఒకటో తారీకు జీతాలు రావడంలేదని, వృద్ధులకు ఒంటరి మహి ళలకు చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన పెన్షన్ రెండు నెలలకు ఒకసారి ఈ ప్రభుత్వం ఇవ్వడం చాలా దారుణమన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వా నికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.



## రజకుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరం

### -గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్

**గజ్వేల్, జులై 27 (ప్రభాతవార్త):** రజకుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని చాకలి ఐలమ్మ భవనంలో రజక సమస్యల పరిష్కారానికై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రజకులకు సరైన కేటాయింపులు లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. బిసి కార్పోరేషన్‌కు కేటాయించిన బడ్జెట్‌లో ప్రభుత్వం రజకుల సమస్యలను విస్మరించిందన్నారు. గతంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లక్షలాది మంది రజకుల ఆశలు అడియాశలయ్యాయని అన్నారు. రజకుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం లాండ్రీ షాపులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసిందని, గత కొద్ది నెలల నుంచి విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వాటిని తక్షణమే విద్యుత్ శాఖకు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని కార్పోరేషన్లకు అధ్యక్షులను నియమించిన ప్రభుత్వం రజకల ఫెడరేషన్‌కు అధ్యక్షున్ని నియమించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రజకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన విధంగా నిధులు కేటాయించి రాష్ట్రంలో రజక ఫెడరేషన్ అధ్యక్షుని నియామకానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం ప్రధాన కార్యదర్శి రాంగారి శ్రీధర్, నాయకులు మెతుకు నర్సింలు, రాచకొండ బాల్‌నర్సయ్య, రాంగారి శివరాజయ్య, ఎల్లన్నగారి మల్లేశం, రాములు, అక్కారం నర్సింలు, రాచకొండ యాదగిరి, వడ్లకొండ శ్రీనివాస్, రాచమల్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మెదక్ జిల్లా సీఈఓ ఎల్లయ్య



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఈఓ ఎల్లయ్య

**అల్లాదుర్గం, జులై 27, ప్రభాతవార్త:** వ్యాధులు ప్రబలకుండా ఎవరి ఇంటి పరిసరాలను వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఈఓ ఎల్లయ్య సూచించారు. మండలంలోని ముస్లాపూర్ గ్రామ పంచాయితీలో శనివారం ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమానికి సీఈఓ ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. పరిశుభ్రతపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది పకడ్బందీగా పని చేయాలని ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రకటకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వన మహోత్సవాన్ని ప్రతి గ్రామంలో కొత్తరకం మొక్కలు నాటుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

**జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించిన ఎల్లయ్య...**

గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సీఈఓ ఎల్లయ్య పరిశీలించారు. విద్యార్థుల కొరకు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఎల్లయ్య పరిశీలించారు. విద్యార్థులకు తరగతి గదిలో పలు సూచనలు చేశారు. క్రమ శిక్షణతో విద్యను ఆర్జించాలని వివరించారు. కార్యక్రమంలో ముస్లాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి (తహసీల్దార్) సతీష్‌కుమార్, ఎంపిడిఓ శంకర్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను అందజేయాలి

### -టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తాన్నగారి కృష్ణమాదిగ

**కొల్చారం, జూలై27 ప్రభాతవార్త:** పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను అందజేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తాన్నగారి కృష్ణమాదిగ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు గత వారం రోజుల నుండి వర్షం కురుస్తున్నప్పటికీ వర్షంలోనే పారిశుద్ధ్య కార్మికులు వానలో తడుచుకుంటూ పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని అన్నారు. వారిని మనం జాగ్రత్తగా చూసుకుంటేనే వారు మన గ్రామాన్ని జాగ్రత్తగా చూసుకుంటారని అన్నారు. కాబట్టి తక్షణమే ఎంపీడీవో, పంచాయితీ కార్యదర్శులకు పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను అందజేయాలన్నారు.

## లలిత వైభవం వ్యవస్థాపకులకు సేవా శిఖర పురష్కారం

**నారాయణఖేడ్ టౌన్, జులై 27, ప్రభాతవార్త:** నారాయణఖేడ్‌లో లలిత వైభవం వ్యవస్థాపకులు మలమంచి మోహన్ జ్యోషికి మోహన్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం హైద్రాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ధార్మిక సేవ శిఖరం బిరుదును ప్రధాన చేశారు. మోహన్ జ్యోషి నారాయణఖేడ్ ప్రాంతంలో లలిత వైభవం ట్రస్టు ద్వార వివిద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలరావు, ట్రస్టు వ్యవస్థాపకులు మహన్‌గాంధీ, దైవజ్ఞ శర్మ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, ఆద్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోహన్‌జ్యోషితో పాటు వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుర్రం కేశవులు

## సిఎం పర్యటనను విజయవంతం చేయండి

**ఆమనగల్లు, జూలై27, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జరిపే కల్వకుర్తి పర్యటనను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రం కేశవులు కోరారు. వెల్దండ మండలం కొట్ర చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటీరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంతోపాటు కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో జరిగే బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని కేశవులు తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో జనసమీకరణపై కేశవులు చర్చించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ఆమనగల్లు నుండి పెద్ద ఎత్తున అభిమానులను తరలించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, కాలె మల్లయ్య, జంతుక యాదయ్య, ఖాదర్‌ఖాద్రి, గండికోట మల్లేశ్, సభావట్ శ్రీను తదితరులు ఉన్నారు.

## మురికి కాలువ సమస్యకు పరిష్కారం

### మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్



మురికి కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 27, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు వార్డులలో మురికి కాలువలలో నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని కాలనీలో వర్షాలకు నీరంతా మురికి కాలువలలోకి చేరి మురికి కుంటగా ఏర్పడడంతో కాలనీ వాసులు విషయాన్ని మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్‌కు తెలియజేశారు. స్పందించిన చైర్మెన్ శనివారం నాడు అట్టి కాలనీలో పర్యటించారు. కాలనీలో నిల్వ ఉన్న మురికి కాలువ సమస్యను తీర్చేందుకు వెంటనే చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వర్షం పడుతున్న కారణంగా జెసిబి ద్వారా కాలువ తీసి మెయిన్ రోడ్డుకు పోయే పెద్ద మురికి కాలువలోకి నీరు పోయేటట్టు వెంటనే పని మొదలుపెట్టాలని మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం ఇట్టి సమస్య పరిష్కారం అయిపోతుందని, త్వరలోనే మున్సిపల్ నిధులతో మురికి కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చైర్మెన్ జితేందర్‌గౌడ్ కాలనీ వాసులకు హామి ఇచ్చారు. ఆయన వెంట పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుట్టి యాదగిరి, మున్సిపల్ ఏఈ సాయిరాం రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు మోడీ బడ్జెట్ మొండి చేయి

### టిపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 27, ప్రభాతవార్త :** మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టి బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు కేంద్రం ప్రభుత్వం మొండి చేయి చూపించిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్ ఆరోపించారు. రామాయంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన ఎనిమిది మంది బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటనే తెలంగాణ ప్రజలకు అనుకూలంగా రాజీనామా చేసి మోడి ప్రభుత్వాన్ని మెడలు వంచాలని అన్నారు. రాజీనామా చేసిన ఎంపీలను, ఎమ్మెల్యేలను తెలంగాణ ప్రజలు నెత్తిన పెట్టుకొని ఏకగ్రీవంగా ఎన్నుకునేటట్లు మేమంతా సహకరిస్తామని అన్నారు. మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వం చేసిన బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజలు అనేకసార్లు వారిక సహకరించారన్న విషయం మర్చిపోయారా అని ఆయన ప్రశ్నించారు. జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కంభంపాటి విప్లవ్‌కుమార్, మెదక్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు జహీరొద్దిన్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల బాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు బండారి కిషన్, పార్టీ యువజన నాయకుడు శీలం సాకేత్‌రెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బైరం కుమార్, బైరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు 10 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే రిజర్వేషన్లను రద్దు చేయాలి

### -టీఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్

**కొల్చారం, జూలై27 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలకు ఎన్నికలకు 10 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే రిజర్వేషన్లను రద్దు చేసి 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే విధంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని టీఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్ అన్నారు. శనివారం కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పుర్ర ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టి సారించడం పట్ల ఎమ్మార్పీఎస్ తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలకు 10 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే రిజర్వేషన్లను రద్దు చేసి 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే విధంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. ప్రత్యేకంగా మన రాష్ట్రంలో ఒక రకంగా పది సంవత్సరాలకు ఒక సారి రిజర్వేషన్లు కొనసాగించడం సరికాదన్నారు. కొన్ని గ్రామాల్లో పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు కూడా అందని రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. అందుకని ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి రిజర్వేషన్ల మార్పు ఖచ్చితంగా ఉండాల్సిందేనని, జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ల మార్పు ఎంతైనా అవసరమన్నారు. పాత విధానం కొనసాగకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. లేనియెడల ఎమ్మార్పీఎస్ తరపున అందుకోసం ఉద్యమించక తప్పదని గుర్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## కందిలో బిజెపి కార్యకర్తల సమావేశం

**కంది, జులై 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలో శనివారం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కౌలంపేట సదానంద చారి ఆధ్వర్యంలో మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి మందుల నాగరాజు హాజరై ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతు దారులు, పార్టీ అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేలా కార్యకర్తలు బూత్ స్థాయిలో సైనికుల్లా పనిచేయాలని మందుల నాగరాజు వివరించారు. మండలంలో పార్టీ ఎదుగుదలకు ఉన్న సమస్యలను కార్యకర్తలు సమావేశం దృష్టికి తేగా సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని సభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలోపార్టీ నాయకుఉ పట్లోళ్ల నర్సారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుయం చంద్రశేఖర్‌గుప్తా, జిల్లా కోశాధికారి నల్ల నర్సింహారెడ్డి, నాయకులు బొర్ర ప్రవీణ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు నాయికోటి రాములు, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల ప్రధాన కార్యదర్శి నల్ల రాంరెడ్డి, బ్యాతోల్ బాస్కర్‌గౌడ్, ఆయా గ్రామాల శక్తి కేంద్ర ఇంచార్జిలు, బూత్ అధ్యఓఉలు పాల్గొన్నారు.